# గోదాము ఆక్రమించి.. గదులు నిర్మించి

- తిష్టవేసిన అక్రమార్కులు
- మంత్రికి వ్యవసాయశాఖ ఫిర్యాదు
- ఆక్రమణలు తొలగించాలని మంత్రి ఆదేశించినా పట్టించుకోని అధికారులు
- ఇటీవల గోదాము రేకులు తొలగించి రూ.30వేలకు విక్రయం!


వ్యవసాయశాఖ గోదాము రేకులను తొలగించిన ఆక్రమణదారులు

**కోదాడ:** కొందరు అక్రమార్కులు కోదాడ పట్టణంలోని వ్యవసాయ శాఖ గోదామునే ఆక్రమించి రెండు గదులు నిర్మించుకుని నివాసముంటున్నారు. ఈ విషయాన్ని మంత్రి ఉత్తమ్ దృష్టికి వ్యవసాయ అధికారులు తీసుకెళ్లారు. ఆక్రమణలు తొలగించి ఆ శాఖకు గోదాము అప్పగించాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేసినా కనీస చర్యలు తీసుకోలేదు. ఇటీవల రాత్రికిరాత్రే గోదాము రేకులను సైతం తొలగించి వాటిని రూ.35వేలకు అమ్ముకున్నట్లు సమాచారం.

**అసలు విషయం ఏమిటంటే..**

వ్యవసాయశాఖకు కోదాడ పట్టణంలో వేరుశనగ కాయలను నిలువ చేసుకోవడానికి ప్రస్తుత సహకార సంఘం సమీపంలో 500 గజాల స్థలంలో గోదాము ఉండేది. ప్రస్తుతం దీని విలువ రూ.5 కోట్ల పైమాటే. దాదాపు 50 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ గోదాము నేటికీ చెక్కుచెదరలేదు. కొంత కాలంగా వ్యవసాయశాఖ దీన్ని వాడడం లేదు. అయితే గోదాము ముందున్న ఖాళీ స్థలంలో కొందరు తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకొని ఉంటున్నారు. నాలుగేళ్ల క్రితం వీరు గోదాము రేకులకు రంధ్రం చేసి లోపల రెండు గదులను నిర్మించుకున్నారు. ఇటీవల దీనిపై ఫిర్యాదు రావడంతో ఆక్రమణదారులు ఆ స్థలం తమదేనని చెప్పుకోవడానికి అడ్డుగా ఉన్న గోదామునే అక్కడి నుంచి మాయం చేయాలని చూశారు. అనుకున్నదే తడవుగా తాము నివాసం ఉంటున్న వైపు గోదాము రేకులను రాత్రిసమయంలో తొలగించి అమ్ముకున్నట్లు స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం కోదాడ మున్సిపాలిటీకి చెందిన టౌన్ ప్లానింగ్ అధికారులు సదరు స్థలం వద్దకు వెళ్లి ఆరాతీశారు. స్థలానికి సంబంధించిన పత్రాలను తీసుకొని రావాలని చెప్పగా వస్తామని చెప్పిన వారు మళ్లీ రాలేదని మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు

**చోద్యం చూస్తున్న వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు**

పట్టణ నడిబొడ్డున కోట్ల రూపాయల విలువైన తమ స్థలం ఆక్రమణకు గురవుతున్నా వ్యవసాయశాఖ అధికారులు కేవలం ఫిర్యాదు చేసి చేతులు దులుపుకున్నారు. పరిరక్షించాలని మంత్రి ఆదేశించినా రెవెన్యూ శాఖ అధికారులు నోటీసు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. స్వయంగా మంత్రి ఆదేశించినా చర్యలు తీసుకోలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం వ్యవసాయశాఖకు కార్యాలయంలేదు. వీరు సంతలో ఉన్న రైతు విశ్రాంతిగృహంలో తాత్కాలికంగా ఉంటున్నారు. అదికూడా శిథిలావస్థకు చేరుకుంది. అయినప్పటికీ తమకు చెందినదాదాపు రూ.5 కోట్ల విలువైన స్థలం ఆక్రమణకు గురవుతుంటే అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ, రెవెన్యూ, మున్సిపల్‌శాఖల అధికారుల సమన్వయంతో మంత్రి ఆదేశాలను అమలు చేసి విలువైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

# దారిలో కూర్చొని బాధితుల ఆందోళన


గాంధీనగర్ కాలనీలో ఆందోళన చేస్తున్న బాధితులు

**కోదాడరూరల్ :** మండలంలోని గణపవరంలో గల గాంధీనగర్ కాలనీలో తమ ఇళ్లకు వెళ్లే బాటను ఓ వ్యక్తి ఆక్రమించాడని బాధితులు మంగళవారం ఆందోళనకు దిగారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో 1988లో తమకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చిందని, ఆ స్థలాల్లో కట్టుకున్న ఇళ్లకు, ఉన్న స్థలాలకు వెళ్లేందుకు 12 అడుగుల బాటను అప్పట్లోనే ప్రభుత్వం తీసిందని తెలిపారు. అయితే ఆ వీధి చివరలో ఉన్న స్థలాన్ని ఇతరులు కొనుగోలు చేశారని, వారు ఇప్పుడు బాట లేదంటూ అడ్డంగా స్తంభాలు పాతి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరికొందరు బాటలోనే గేదెలను కట్టేస్తున్నారని పేర్కొన్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే వారు తమను కులం పేరుతో దూషిస్తున్నారని తెలిపారు. ఈ విషయమై పోలీసులను ఆశ్రయిస్తే వారు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు దీనిపై విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో పప్పుల పాపమ్మ, ఏసోబు, తిరపయ్య, కోటయ్య, పిట్టల భాగ్యమ్మ ఉన్నారు.

# 'మిట్స్'లో రోబోటిక్స్‌పై వర్క్ షాప్


రోబోటిక్స్‌పై అవగాహన కల్పిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ సునిల్‌కుమార్

**చిలుకూరు :** మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో యూనిఫస్ట్ రోబోటిక్స్ బెంగళూరు వారి సహకారంతో మంగళవారం రోబోటిక్స్‌పై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిఫస్ట్ రోబోటిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ సునిల్‌కుమార్ మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్యార్థులు రోబోటిక్స్ రంగంలో రాణించాలని సూచించారు. వర్క్ షాపులో నేర్చుకున్న పరిజ్ఞానాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి ప్రియాంక మాట్లాడుతూ.. రాబోయే రోజులు రోబోటిక్స్‌పైనే ఆధారపడి ఉంటుందన్నారు. విద్యార్థులు కూడా రోబోటిక్స్‌పై పట్టు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మధిర ప్రీతిరెడ్డి, వైస్ చైర్మన్ మధిర గౌతమ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కేశవరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నర్సిరెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### స్నేహితుడి కుటుంబానికి చేయూత


నగదు డిపాజిట్ చేసి పాస్‌బుక్‌లు అందజేస్తున్న స్నేహితులు

**నడిగూడెం :** మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన సయ్యద్ హుస్సేన్ (40) ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. అతనితో పాటు 1997 –98 విద్యా సంవత్సరంలో 10వ తరగతి కలిసి చదువుకున్న స్నేహితులు.. మంగళవారం హుస్సేన్ కూతుర్లు షహనాజ్, సనా కౌసర్ పేరిట రూ.20 వేల చొప్పున మొత్తం రూ.40 వేలు సిరిపురం ఎస్‌బీఐలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి చేయూతనందించారు. కార్యక్రమంలో హుస్సేన్ భార్య ఫరిదా, తదితరులు పాల్గొన్నారు.

### పశువైద్యశాల మరమ్మతులకు రూ.13వేల విరాళం

**కోదాడరూరల్ :** కోదాడ ప్రాంతీయ పశువైద్యశాల భవనంలో చెదలు పట్టి పుచ్చిపోయి ఊడిపోయేలా ఉన్న కిటికీ స్థానంలో కొత్తది ఏర్పాటు చేసేందుకు గాను కోదాడ పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీకి చెందిన తూమాటి సురేష్‌రెడ్డి రూ.13వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతను వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెంటయ్య అభినందించారు. దాతలు సహకరిస్తే మూగజీవాలకు మెరుగైన చికిత్స అందిస్తామని పెంటయ్య తెలిపారు.

### జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు సన్మానం


రామారావును సన్మానిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

**కోదాడ :** జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన వంగవేటి రామారావును మంగళవారం కోదాడ వాసవీ క్లబ్ సభ్యులు కొమరబండలోని ఆయన స్వగృహంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరా రు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు సే కు శ్రీనివాసరావు, కార్యదర్శి పత్తి నరేందర్, కో శాధికారి వెంపటి ప్రసాద్, బెలిదే భరత్, పబ్బా గీత, ఇమ్మడి సతీష్‌బాబు, గుడుగుంట్ల సాయి, బండారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



అనిల్‌కుమార్

**నేరేడుచర్ల :** మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన సుంకబుడ్డి గోపి– పద్మ కుమారుడు సంకబుడ్డి అనిల్‌కుమార్‌యాదవ్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల ఆదిలాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలో ఆడిన 30 మంది క్రీడాకారుల్లో అనిల్‌కుమార్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి తెలంగాణ పురుషుల సీనియర్ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ నెల 20వ తేదీ నుంచి 23 వరకు ఒరిస్సా రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి క్రీడలో ఆడనున్నాడు. నిరుపేద కుటుంబం నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై న అనిల్‌కుమార్‌ను గ్రామంలో పలువురు అభినందించారు.

### ఆంజనేయుడికి ఆకుపూజ


ఆకుపూజలో పాల్గొన్న భక్తులు

**హుజూర్‌నగర్‌రూరల్ :** మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి, గోపాలపురంలోని ఆంజనేయ స్వామి దేవాలయాల్లో మంగళవారం ఆంజనేయస్వామికి ఘనంగా ఆకుపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, సేవాకాలం, అలంకరణ, పంచామృతాలతో అభిషేకం, ఆకుపూజ, మంగళాశాసనం, తీర్థప్రసాద వితరణ వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో బూరుగడ్డ ఆలయ చైర్మన్ యరగాని గురవయ్యగౌడ్, ఆలయాల ఈఓలు ఎంపి లక్ష్మణరావు, చలపతి, అర్చకులు హరీష్‌కుమార్‌చార్యులు, అలహరి నర్సింహాచార్యులు, సిబ్బంది యరగాని కిరణ్‌కుమార్‌గౌడ్, ఉపేందర్, రమేష్, భక్తులు పాల్గొన్నారు.

### ఆర్థికసాయం అందజేత

**కోదాడరూరల్ :** కోదాడలో అనారోగ్యంతో మృతి చెందిన పండ్ల వ్యాపారి మస్తాన్ మృతదేహాన్ని మంగళవారం పండ్ల వ్యాపారుల సంఘం గౌరవ అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ షేక్.బషీర్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. నివాళులర్పించిన వారితా పండ్ల వ్యాపారుల సంఘం సభ్యులు షమీఉల్లా, ఇస్మాయిల్, సుభానీ, జానిమియా, సున్ని, నరసింహారావు తదితరులు ఉన్నారు.

# వైభవంగా నారసింహుని నిత్యకల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**మఠంపల్లి :** మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించారు. కల్యాణ తంతులో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, ఋత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్యధారణ నిర్వహించారు. అదేవిధంగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయ స్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, భక్తులు పాల్గొన్నారు.

## 'ఉపాధి' పనులను సద్వినియోగం చేసుకోవాలి


నడిగూడెంలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సంజీవయ్య

**నడిగూడెం :** కూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ దాసరి సంజీవయ్య కోరారు. మంగళవారం నడిగూడెం మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని పని దినాలకు కూలీలు హాజరు కావాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పనులను పరిశీలించాలని, కూలీలకు పనులు కల్పించాలని సూచించారు. ఆయన వెంట ఏపీఓ రవీంద్ర నాయక్, ఈసీ శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ, తదితరులు ఉన్నారు.

# టీబీ రహిత దేశంగా మార్చటమే లక్ష్యం


టీబీ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యులు

**గరిడేపల్లి :** టీబీ రహిత దేశంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం వంద రోజుల పాటు నిక్షయ్ శివిర్ కార్యక్రమం నిర్వహిస్తుందని, టీబీ రహిత సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలని మండల వైద్యాధికారి నరేష్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిక్షయ్ శివిర్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. టీబీ అనుమానిత లక్షణాలు ఉన్న వారిని గుర్తించి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 103 మందికి ఎక్స్‌రే, టెస్టులు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ శారద, సూపర్‌వైజర్ అంజయ్యగౌడ్, ఎంఎల్‌హెచ్‌పీలు మమత, ఏఎన్‌ఎంలు కవిత, అంజలి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గురుకుల పాఠశాల వార్షికోత్సవం


జ్యోతి ప్రజల్వన చేస్తున్న తహసీల్దార్ సైదులు

**నేరేడుచర్ల :** మండలంలోని చిల్లేపల్లి గ్రామంలో గల మహాత్మా జ్యోతిరావ్‌పూలే బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో మంగళవారం పాఠశాల వార్షికోత్సవం, వీడ్కోలు పార్టీని ఘనంగా జరుపుకున్నారు. ముందుగా తహసీల్దార్ సురిగి సైదులు, ఎంఈఓ పి.సత్యనారాయణరెడ్డి, ఎస్‌ఐ రవీందర్ నాయక్ పాల్గొని జ్యోతి ప్రజల్వన చేసి వేడుకను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటరమణ, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అనుకరణ, వైస్ ప్రిన్సిపాల్ ఎం.సుజాత, డిప్యూటీ వార్డెన్ స్వాతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్


విద్యార్థుల ఎగ్జిబిట్ల ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

**నేరేడుచర్ల :** పట్టణంలోని శ్రీవాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో యులిఫ్స్ అంతర్జాతీయ విద్యా రంగ సంస్థ ఆధ్వర్యంలో గత ఆరు నెలలుగా కంప్యూటర్ ఆధారిత సాంకేతిక విజ్ఞానంపై ఇచ్చిన శిక్షణ ముగిసింది. మంగళవారం పాఠశాలలో ముగింపు కార్యక్రమంతో పాటు సైన్స్ ఫేయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ఎగ్జిబిట్లను నేరేడుచర్ల, పాలకీడు, గరిడేపల్లి మండలాల ఎంఈవోలు సత్యనారాయణరెడ్డి, కాటయ్య, చత్రునాయక్ తిలకించారు. పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

## అమరవరంలో ముగిసిన లింగమంతుల జాతర

**హుజూర్‌నగర్ :** మండలంలోని అమరవరంలో గల లింగమంతులస్వామి, గంగమ్మ జాతర ముగిసింది. మంగళవారం ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చంద్రపట్నం వేయుట, గావుపట్టు కార్యక్రమాన్ని యాదవ కులస్తులు వైభవంగా నిర్వహించారు. తదనంతరం స్వామివారికి యాటలు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మద్దుల కృష్ణయాదవ్, కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## పాలకవర్గాల పదవీ కాలం పొడిగింపుపై హర్షం


సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

**హుజూర్‌నగర్‌రూరల్ :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పాలకవర్గాల పదవీ కాలాన్ని ఆరు నెలల పాటు పొడిగించడం పట్ల హుజూర్‌నగర్ మండలం వేపలసింగారం పీఏసీఎస్ చైర్మన్ రాధాకృష్ణ, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చక్కెర వీరారెడ్డి, మాజీ ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్

**మిర్యాలగూడ టౌన్ :** ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్యను పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ ఆరోగ్యశాఖ నిర్వహించే కార్యక్రమాలను వంద శాతం విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు కేసా రవి, గీతావాణి, డాక్టర్లు కళ్యాణ్‌చక్రవర్తి, కృష్ణకుమారి, అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు ఎండిపోకుండా చూడాలి

**మిర్యాలగూడ :** నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు నీటిని పోసి సంరక్షించాలని డీఆర్‌డీఓ వై.శేఖర్‌రెడ్డి సూచించారు. మంగళవారం దామరచర్ల మండలంలోని బొట్టెతండా, పాచ్చునాయక్‌తండా, దామరచర్ల, వీర్లపాలెం గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. మొక్కలు ఎండిపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీఓ మూర్తి, సిబ్బంది ఉన్నారు.

## జాతరలు సంస్కృతి, సంప్రదాయాలకు వారధి

**సూర్యాపేటటౌన్ :** తెలంగాణలో నిర్వహించే జాతరలు సంస్కృతి, సంప్రదాయాలకు వారధి అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. దురాజ్‌పల్లి పెద్దగట్టు (గొల్లగట్టు) లింగమంతుల స్వామిని మంగళవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్, మెప్మా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, రమేష్, కోల కరుణాకర్, అశోక్, లింగన్న, ప్రసాద్, నరేష్, మహేష్, మనోహర్, వినయ్, కోటి, వికాస్, ఉత్సవ నిర్వాహకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు


హుజూర్‌నగర్‌లో కేక్ కట్ చేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

**హుజూర్‌నగర్ :** ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి పుట్టినరోజు వేడుకలను మంగళవారం హుజూర్‌నగర్‌లోని చింతలమిల్లు ఆవరణలో ఇటుక బట్టి కార్మికుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బెల్లంకొండ గురువయ్య, గుంటిక కరుణాకర్‌రెడ్డి, నాయకులు చిట్యాల అమర్‌నాథ్‌రెడ్డి, మేళ్లచెరువు ముక్కంటి, కందుల వెంకన్న, మద్దం నాగేందర్, మేకపోతుల వీరబాబు, పాలకురి లాలుగౌడ్, జాన్ సైదా, లలిత, గడ్డం నాగరాజు, నాగమణి, యాకమ్మ పాల్గొన్నారు.

**సంజీవరెడ్డికి శుభాకాంక్షలు..**

**హుజూర్‌నగర్ :** చత్తీస్‌ఘడ్ రాష్ట్ర రాజధాని రాయపూర్‌లో మంగళవారం జరిగిన ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి 96 జన్మదిన వేడుకలకు హుజూర్‌నగర్‌కు చెందిన ఐఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

**నేరేడుచర్ల :** ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం నేరేడుచర్లలో రాజీవ్‌గాంధీ పెయింటింగ్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ అనుబంధ సంఘం) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, యూనియన్ మండల అధ్యక్షుడు నన్నెపంగ శ్రీనివాస్, కోశాధికారి యడవెల్లి సందీప్, ఒగ్గు సైదులు, వెంకన్న, జానయ్య, శ్రీరాములు, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మహిళకు రక్తదానం

**హుజూర్‌నగర్ :** పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎలక రాజేశ్వరి శస్త్రచికిత్స నిమిత్తం రక్తం అవసరమైంది. మంగళవారం పట్టణానికి చెందిన చంటి శ్రీనాథ్ ఆమెకు రక్తదానం చేశారు. దీంతో అతనిని పలువురు అభినందించారు.

## రిటైర్డు ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

**హుజూర్‌నగర్ :** హుజూర్‌నగర్‌కు చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు పశ్య నారాయణరెడ్డి సోమవారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని మంగళవారం వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

## టాటా ఏస్ బోల్తా.. ఇద్దరికి తీవ్ర గాయాలు

**తిరుమలగిరి :** కొబ్బరిబోండాల లోడుతో వెళ్తున్న టాటా ఏస్ వాహనం మంగళవారం తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఫాతిమా స్కూల్ సమీపంలో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ శేఖర్‌తోపాటు ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారికి నాగారం మండలంలో హెల్త్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మెరుగు యాదగిరి ప్రాథమిక చికిత్స అందజేశారు. అనంతరం పోలీసులు క్షతగాత్రులను 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## సంస్కృతికి నిలయం పెద్దగట్టు

**సూర్యాపేట / భానుపురి (సూర్యాపేట) :** బహుజన సంస్కృతికి నిలయం పెద్దగట్టు అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం దురాజ్‌పల్లి పెద్దగట్టు లింగమంతుల స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వయంగా డోల్ వాయిస్తూ సంప్రదాయ నృత్యం చేశారు. బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యాం కురుమ, విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్, బీసీ నేతలు తన్నీరు రాంప్రభు, మధు యాదవ్, సంపత్ నాయుడు, వెంకటనారాయణ పాల్గొన్నారు.

# కేబుల్ వైర్లు ఇలా.. స్తంభం ఎక్కేదెలా


అభినవ్ వీధిలో విద్యుత్ స్తంభానికి వేలాడుతున్న కేబుల్ వైర్లు

**కోదాడ :** పట్టణంలోని విద్యుత్ స్తంభాలు సాలెగూళ్లను తలపించేలా తయారయ్యాయి. వివిధ రకాల ఇంటర్‌నెట్, టీవీ చానళ్ల కేబుల్ వైర్లను ఒక విద్యుత్ స్తంభం నుంచి మరో స్తంభానికి లాగి సేవలు అందిస్తున్నారు. కానీ విద్యుత్ స్తంభాల వద్ద ఒక క్రమ పద్ధతిలో కాకుండా ఇష్టానుసారంగా కేబుల్ వైర్లు వేలాడదీసి, కట్టలుగా వదిలేశారు. దీంతో అవి తరచూ తెగి విధుల్లో వేలాడుతుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇక విద్యుత్ దీపాలను మార్చాలన్నా, విద్యుత్ సమస్య తలెత్తినప్పుడు సర్వీస్ వైర్లు మార్చుకోవాలన్నా స్తంభాలను ఎక్కడానికి నానా ఇబ్బంది పడాల్సి వస్తుందని మున్సిపల్, విద్యుత్ సిబ్బంది అంటున్నారు. కొన్ని స్తంభాల వద్ద వీటిని కొద్ది ఎత్తులోనే వేలాడతీస్తుండడంతో వచ్చిపోయే వాహనాలకు తగులుతున్నాయి. విద్యుత్ స్తంభాలను వాడుకున్నందుకు కేబుల్ నిర్వాహకులు విద్యుత్ శాఖకు, మున్సిపాలిటీకి చార్జీ చెల్లించాల్సి ఉండగా సక్రమంగా చెల్లించడం లేదని సమాచారం.

# బేతవోలులో కనకదుర్గమ్మ జాతర లేనట్టేనా !

- గ్రామంలో నాయకుల మధ్య వర్గపోరు
- ప్రతి వేడుకల్లో ఘర్షణలు
- జాతరకు అనుమతులు ఇవ్వని పోలీసులు
- ఆలయంలో పూజలు, మొక్కులు చెల్లించుకోవాలని సూచన
- సాంస్కృతిక కార్యక్రమాలు, ఎడ్ల పందేలకు నిరాకరణ


బేతవోలులోని కనకదుర్గమ్మ ఆలయం

**చిలుకూరు :** మండలంలో మేజర్ గ్రామ పంచాయతీ అయిన బేతవోలు గ్రామంలో ఈ ఏడాది కనకదుర్గమ్మ జాతర (బండ్ల పండుగ) నిర్వహణపై సందిగ్ధం నెలకొంది. ఈనెల 20, 21, 22 తేదీల్లో గ్రామంలో జాతర ఉంటుంది. ఈ నేపథ్యంలో మంగళవారం నిర్వహించిన అఖిల పక్ష నాయకుల సమావేశంలో పాల్గొన్న కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, చిలుకూరు ఎస్‌ఐ సురభీ రాంబాబు గౌడ్ జాతరకు అనుమతులు ఇవ్వలేమని తేల్చి చెప్పారు. కేవలం ఆలయంలో పూజలు, మొక్కులు చెల్లించుకోవాలని చెప్పారు. ప్రభల ఏర్పాటు, కోలాట ప్రదర్శన వంటి సాంస్కృతిక కార్యక్రమాలు, ఎడ్ల పందేలకు అనుమతులకు పోలీసులు నిరాకరించారు. గ్రామంలో పలువురి నాయకుల మధ్య వర్గ పోరుతో పలు వేడుకల్లో ఘర్షణలు జరుగుతుండడంతో ఇప్పుడు జారత నిర్వహిస్తే మళ్లీ ఏదైనా గొడవలు జరిగే అవకాశం ఉంటుందని, అంతేకాకుండా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**గ్రామంలో నిత్యం ఘర్షణలు..**

అయితే గ్రామంలో మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వట్టికూటి నాగయ్య మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. దీంతో గ్రామంలో తరచూ వివాదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. రెండేళ్ల క్రితం జరిగిన కనకదుర్గమ్మ జాతరలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పోలీసులకు గాయాలయ్యాయి. ఈ ఏడాది దసరా ఉత్సావాల్లో వట్టికూటి నాగయ్యపై దాడి జరగడంతో ఇరువర్గాల మధ్య వివాదం పెగిరి ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో పోలీసులు లాఠీచార్జ్ చేశారు. ఆ సమయంలో ప్రస్తుత ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇది మరవక ముందే వినియక చవితికి విగ్రహాల ఊరేగింపులో గొడవలు జరిగాయి. అంతేకాకుండా ఇటీవల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగి రాళ్లు రువ్వుకోవడంతో నలుగురిపై కేసులు నమోదయ్యాయి. ఇలా గ్రామంలో ప్రతి వేడకకు గొడవలు జరుగుతుండడంతో పోలీసులు అనుమతులు నిరాకరిస్తున్నారు. అయితే జాతరలో ప్రభల ఊరేగింపు, అన్ని పార్టీల ఆధ్వర్యంలో వేర్వేరుగా కోలాట ప్రదర్శలు, లైటింగ్ ప్రభల ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు కనుల పండువగా జరుగుతాయి. అక్కడ ఎన్నో ఏళ్ల నుంచి వస్తున్న ఆనవాయితీ ఇది. అలాంటిది జాతరను వైభవంగా నిర్వహించకపోతే ఎలా అని కొందరు గ్రామస్తులు అంటున్నారు. జాతర నిర్వహిస్తే గ్రామంలో గొడవలు జరుగుతాయని అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటే సరిపోతుందని పలువురు గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.